నమస్తే తెలంగాణ
# జనగామ
3 వరంగల్, సోమవారం 21 ఏప్రిల్ 2025 JANAGAON


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు

## సమష్టిగా కదులుదాం..

- సభను విజయవంతం చేద్దాం
- రజతోత్సవానికి లక్షలాదిగా తరలిరానున్న శ్రేణులు
- కాంగ్రెస్ ప్రభుత్వంపై విరక్తితో బీఆర్‌ఎస్ వైపు చూస్తున్న ప్రజలు
- ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు

మహబూబాబాద్, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ) : అధిష్టానం ఆదేశాల మేరకు బీఆర్‌ఎస్ శ్రేణులు సమష్టిగా కదిలి రజతోత్సవ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు పిలుపునిచ్చారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి లక్షలాదిగా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు తరలిరానున్నారని తెలిపారు. ఆదివారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మధ్యాహ్నం 3 గంటల వరకు సభ వేదిక వద్దకు చేరుకునేలా బయలుదేరాలని సూచించారు. ప్రతి వాహనానికి ఒక ఇన్‌చార్జితో పాటు కావాల్సిన ఆహార పొట్లాలు, వాటర్ బాటిళ్లు, మజ్జిగ ప్యాకెట్లు సమకూర్చినట్లు తెలిపారు. ఏడాదిన్నర నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమీ లేదని విరక్తి చెందిన ప్రజలు బీఆర్‌ఎస్ వైపు చూస్తున్నారని, తిరిగి కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్ రాష్ట్రవ్యాప్తంగా విజయం సాధించడం ఖాయమన్నారు. ప్రతి ఊరు నుంచి పెద్ద ఎత్తున తరలి వచ్చి రజతోత్సవ సభను విజయవంతం చేయాలని తక్కళ్లపల్లి కోరారు. సమావేశంలో మానుకోట మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, పట్టణ అధ్యక్షుడు గద్దె రవి, మాజీ కౌన్సిలర్ ఎడ్ల వేణు, రఘు, తెల్ల శీను, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.




# వ్యతిరేక శక్తులతోనూ జై తెలంగాణ అనిపించారు

కేసీఆర్ ప్రసంగం కోసం దేశమంతా ఎదురుచూస్తోంది

- రజతోత్సవ సభకు ఇంటికొకరు రావాలి
- కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏ ఒక్కరూ సంతోషంగా లేరు
- శాసనమండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి
- సభా స్థలిలో ఏర్పాట్ల పరిశీలన




ఎల్కతుర్తి, ఏప్రిల్ 20 : ఉద్యమ సమయంలో ప్రత్యేక రాష్ట్ర వ్యతిరేక శక్తులతో సైతం జై తెలంగాణ అనిపించిన ఘనత కేసీఆర్‌ది అని శాసనమండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి అన్నారు. బీఆర్‌ఎస్ రజతోత్సవ మహాసభకు రాష్ట్రంలోని ప్రతి ఇంటి నుంచి ఒక్కరు చొప్పున తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం ఎల్కతుర్తి సభా ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సిరికొండ మాట్లాడుతూ ఎల్కతుర్తి సభ చరిత్రాత్మకమైనదని, 14 ఏండ్ల ఉద్యమం తర్వాత పదేండ్లలో రాష్ట్రానికి కేసీఆర్ అద్భుత పాలనను అందించారని, తెలంగాణను దేశానికే రోల్ మోడల్‌గా నిలబెట్టారన్నారు. కేసీఆర్ పిలుపునిస్తే బహిరంగ సభలకు ప్రజలు లక్షలాదిగా తరలివస్తారని, అందుకు ఆయనపై ఉన్న విశ్వాసమే కారణమన్నారు. 16 నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తూనే ఉందన్నారు. ఇది పూర్తిగా పర్సంటేజీల ప్రభుత్వమని, తెలంగాణ ప్రజల ప్రయోజనాలకు భిన్నంగా వ్యవహరించడం కాంగ్రెస్ నైజమని దుయ్యబట్టారు. ఈ ప్రభుత్వం ఏ వర్గానికీ న్యాయం చేయలేదని, రాష్ట్రంలో ఒక్కరు కూడా సంతోషంగా లేరని విమర్శించారు. తాను ఈ రోజు హుస్నాబాద్ నుంచి వస్తుంటే చెరువులన్నీ ఎండిపోయి కనిపించాయని, ఏడాదిన్నర క్రితం జలాశయాలు నీటితో కళకళలాడేవని గుర్తుచేశారు. ప్రపంచం మెచ్చుకునే రీతిలో కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి తాగు, సాగు నీళ్లకు కొదువలేకుండా చేశారని, అద్భుతమైన పంటలు పండేలా చూశారన్నారు.


పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతున్న సిరికొండ మధుసూదనాచారి


ఇప్పుడు కాళేశ్వరం నీళ్లను వాడుకునే చిత్తశుద్ధి కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదన్నారు. ఇది ఇలాగే కొనసాగితే రాష్ట్రంలో కరువు, కాటకాలు వచ్చే ప్రమాదముందని ఆవేదన వ్యక్తం చేశారు. హైడ్రాతో హైదరాబాద్‌లో గందరగోళం సృష్టించారని, రాజధానితో రాష్ట్రంలోని ప్రతి ఊరికి సంబంధం ఉంటుందని వివరించారు. హెచ్‌సీయూలో దమనకాండను దేశం మొత్తం చూసిందని, కేసీఆర్ మొక్కలు నాటిస్తే, రేవంత్ విధ్వంసం సృష్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి ముకుతాడు వేసేది ప్రజాశక్తే అని, ప్రజలకు అన్నీ చెప్పాల్సిన అవసరం ఉందని, మెడలు వంచడం, హామీలు అమలయ్యేలా చూడడం ప్రతిపక్షంగా బీఆర్‌ఎస్ బాధ్యతన్నారు. తెలంగాణ ప్రయోజనాలకు ద్రోహం కలుగుతుంటే ప్రజల తరపున గొంతు విప్పడానికే కేసీఆర్ రజతోత్సవ సభ నిర్వహిస్తున్నారని సిరికొండ చెప్పారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గ్యాదరి బాలమల్లు, వరంగల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చింతం సదానందం తదితరులున్నారు. అంతకు ముందు సభా ప్రాంగణాన్ని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి పరిశీలించి, ఆ నియోజకవర్గ ప్రజలకు కేటాయించిన పార్కింగ్ స్థలాలను చూసి వెళ్లారు.


బీఆర్‌ఎస్‌లో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

## బీఆర్‌ఎస్‌లోకి 50 మంది కాంగ్రెస్ నేతలు

గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ) : జనగామ జిల్లా తరిగొప్పుల మండలం బొత్తలపర్రెకు చెందిన 50 మంది కాంగ్రెస్ ముఖ్య నాయకులు ఆదివారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. జనగామలోని క్యాంపు కార్యాలయంలో వీరికి ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు గడుస్తున్నా పాలనలో పూర్తిగా విఫలమైందని, స్థానిక ఎమ్మెల్యే పల్లా చేస్తున్న ప్రజాసేవ తమకు నచ్చిందని, ఆయన పేదలకు ఉచిత వైద్యం అందిస్తున్న కృషికి ఫిదా అయి బీఆర్‌ఎస్ పార్టీలో చేరినట్లు తెలిపారు.


శ్రీపతిపల్లిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

## ప్రజలు వేలాదిగా తరలిరావాలి

- బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలి
- సన్నాహక సమావేశంలో మాజీ ఎమ్మెల్యే రాజయ్య

చిల్పూరు, ఏప్రిల్ 20 : బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు ప్రజలు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే రాజయ్య పిలుపునిచ్చారు. జనగామ జిల్లా చిల్పూరు మండలం శ్రీపతిపల్లిలో పార్టీ మండల ఇన్‌చార్జి మాలోత్ రమేశ్‌నాయక్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలో క్లస్టర్ల వారీగా సన్నాహక సమావేశాలు నిర్వహించాలని, సభ వాల్‌పోస్టర్లను విడుదల చేయాలని, గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలను తరలించాలన్నారు. సమావేశంలో నియోజకవర్గ కోఆర్డినేటర్ కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి, చిల్పూరు ఇన్‌చార్జి ముత్యాల బాలనర్సయ్య, యూత్ అధ్యక్షుడు శివగామి అంజయ్య, కొమురవెల్లి దేవస్థానం మాజీ డైరెక్టర్ గిరిధర్, చేర్యాల సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు ఎల్లయ్య, జిల్లా నాయకులు జనగామ యాదగిరి, బత్తుల రాజన్‌బాబు, తాళ్లపల్లి జగన్నాథం, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్లు బత్తుల రాజన్‌బాబు, రంగు హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్ సత్తా చూపాలి

మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్

నయీంనగర్, ఏప్రిల్ 20 : ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ బహిరంగ సభకు పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావాలని మాజీ చీఫ్ విప్, పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ పిలుపునిచ్చారు. ఆదివారం వడ్డేపల్లి బాలయ్య హోటల్ వద్ద జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ బహిరంగ సభకు తరలివచ్చి మళ్లీ బీఆర్‌ఎస్ అంటే ఏమిటో చూపించాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ లోహిత రాజు, మాజీ కార్పొరేటర్ దాస్యం విజయ్‌భాస్కర్, స్వప్న, అరుణ, శ్రావణ్, చిన్న, మధు, చంద్రమౌళి, జైపాల్, సుదర్శన్, ప్రసంగి తదితరులు పాల్గొన్నారు.


జెండా ఆవిష్కరించి మాట్లాడుతున్న దాస్యం వినయ్‌భాస్కర్

## ఉద్యమస్ఫూర్తిని చాటాలి

- రజతోత్సవానికి వేలాదిగా తరలిరావాలి
- బహిరంగ సభ చరిత్రలో నిలిచిపోతుంది
- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నల్లబెల్లి, ఏప్రిల్ 20 : నర్సంపేట నియోజకవర్గ ప్రజలు ఉద్యమ స్ఫూర్తిని చాటాలని, ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు సమయం ఆసన్నమైందని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఆదివారం వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కేంద్రంలోని ఆయన నివాసంలో పార్టీ ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. రజతోత్సవ సభకు బయలుదేరే ముందు గ్రామాల్లో గులాబీ జెండాలు ఆవిష్కరించాలని, అనంతరం ప్రజలతో కలిసి సభకు పెద్ద ఎత్తున తరలిరావాలని సూచించారు. ఇప్పటికే కేసీఆర్ సభ అంటేనే అధికార పార్టీల్లో అలజడి మొదలైందన్నారు. 420 హామీలతో గద్దెనెక్కిన రేవంత్ సర్కారు వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కోట్లాది రూపాయలు ఢిల్లీకి చేర్చడమే పనిగా పెట్టుకున్న సీఎంకు ప్రజలు బుద్ధి చెప్పేందుకు సన్నద్ధం కావాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఏ గ్రామంలో ఎంతమంది సభకు వెళ్తున్నారనే సమాచారాన్ని ఇంటెలిజెన్స్ ద్వారా కాంగ్రెస్ పార్టీ సమాచారం సేకరిస్తున్నదన్నారు. అడ్డంకులు, అడ్డుగోడలను కూల్చుకుంటూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్న ప్రజలు భయమెరుగరని, చరిత్రలో నిలిచిపోయేలా రజతోత్సవ సభను విజయవంతం చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీ, మండల పార్టీ అధ్యక్షుడు బానోత్ సారంగపాణి, మాజీ అధ్యక్షుడు ఊడుగుల ప్రవీణ్‌గౌడ్, మాజీ ఎంపీపీ కక్కెర్ల శ్రీనివాస్‌గౌడ్, నాయకులు క్యాతం శ్రీనివాస్, గుగులోత్ సారయ్య, వీరస్వామి, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## సభతో అధికార పక్షానికి దడ పుట్టాలి

- లక్షలాదిగా వచ్చి రజతోత్సవాన్ని విజయవంతం చేయాలి
- ఏ ఊరెళ్లినా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు తిడుతున్నరు
- భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

భూపాలపల్లి రూరల్/ఎల్కతుర్తి, ఏప్రిల్ 20: ఒకే వేదికపై లక్షలాది మంది జై తెలంగాణ అని నినదిస్తే అధికార పక్షానికి దడ పుట్టాలని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈనెల 27న నిర్వహించనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం భూపాలపల్లి మండలంలోని నేరేడుపల్లి, వజినేపల్లి, గొర్లవీడు, కొంపెల్లి గ్రామాల్లో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గండ్ర మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ తెలంగాణను సాధించి దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దారన్నారు. ప్రజలు రేవంత్‌రెడ్డి మోసపూరిత మాటలకు ఆశపడి కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని, ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు చేయాలని అడిగితే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ కాలం గడుపుతున్నారని ఎద్దేవా చేశారు. రజతోత్సవ సభ కోసం వాల్ రైటింగ్ చేయిస్తే వాటిని మలిపేస్తున్నారని, ఈనెల 26న నిర్వహించే జాబ్ మేళాను 27కు మార్చి పోలీసు అధికారులతో ప్రచారం నిర్వహిస్తున్నారని అన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలని, ఇలాంటి దిక్కుమాలిన పనులు ఆపివేయాలని హెచ్చరించారు. ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తిడుతున్నారని, కేసీఆర్‌ని కాదని రేవంత్‌రెడ్డిని నమ్మి మోసపోయామని కంటతడి పెడుతున్నారన్నారు. కేసీఆర్ ఇచ్చిన స్ఫూర్తితో హక్కులు సాధించుకోవాలని, లక్షలాదిగా రజతోత్సవ సభకు రావాలని గండ్ర అన్నారు. సమావేశాల్లో మాజీ ఎంపీపీ కల్లెపు రఘుపతి, పార్టీ మండలాధ్యక్షుడు పిన్ రాజిరెడ్డి, మాజీ మండలాధ్యక్షుడు మందల రవీందర్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ సాగర్‌రెడ్డి, భూపాలపల్లి పట్టణ అధ్యక్షుడు కటకం జనార్దన్, గుడాడుపల్లి మాజీ సర్పంచ్ ఉడుత ఐలయ్య, సీనియర్ నాయకులు పింగిళి రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు. కాగా, ఎల్కతుర్తిలోని బీఆర్‌ఎస్ రజతోత్సవ సభా స్థలిని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆదివారం పరిశీలించారు. మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, వొడితెల సతీశ్‌కుమార్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాసుదేవారెడ్డి, బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ సతీశ్‌రెడ్డితో కలిసి ఆయన సభా ప్రాంగణమంతా కలియదిరిగారు. అనంతరం భూపాలపల్లి నియోజకవర్గానికి కేటాయించిన పార్కింగ్ స్థలాలను నాయకులతో కలిసి పరిశీలించారు.


ఎల్కతుర్తిలో సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

## ఉద్యమంలో టీజేఎఫ్ పాత్ర ఉన్నతమైనది

- మే 31న హైదరాబాద్‌లో రజతోత్సవం
- ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ


మాట్లాడుతున్న ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ

దామెర, ఏప్రిల్ 20 : ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం చేసిన మలిదశ ఉద్యమ పోరాటంలో మొట్టమొదటి రాజకీయేతర వేదిక తెలంగాణ జర్నలిస్టు వేదిక అని, అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలను సంఘటితం చేసిన ఘనత టీజేఎఫ్‌దేనని ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ అన్నారు. టీజేఎఫ్ అవిర్భవించి మే 31నాటికి 25 ఏండ్లకు చేరుకుంటున్న సందర్భంగా రజతోత్సవ సభ నిర్వహణ కోసం టీయూడబ్ల్యూజే–హెచ్ 143 ఆధ్వర్యంలో ఆదివారం దామెర మండలం దుర్గంపేట శివారులోని ఎస్‌ఎస్‌ఆర్ కన్వెన్షన్ హాల్‌లో రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అల్లం నారాయణ మాట్లాడుతూ 2001లో టీఆర్‌ఎస్ పార్టీ పురుడు పోసుకున్న నెలరోజులకే పుట్టిన మొట్టమొదటి రాజకీయ వేదిక తెలంగాణ జర్నలిస్టు వేదిక అని అన్నారు. వరంగల్ నుంచి జర్నలిస్టు సునీల్ ఆత్మ బలిదానం చేసిన చరిత్ర ఉందని, ఉద్యమం చల్లబడ్డప్పుడు కీలకంగా ఇటువంటి ఘటనలు తట్టిలేపాయన్నారు. 2001, మే 31వ తేదీన ఆవిర్భవించిన టీజేఎఫ్ వచ్చే 2025 మే 31వ తేదీ నాటికి 25 సంవత్సరాలకు చేరుకుంటుందని, అందులో భాగంగా రజతోత్సవాలను నిర్వహించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ మేరకు రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో రజతోత్సవాలకు చేపట్టాల్సిన కార్యాచరణ, అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. హైదరాబాద్ వేదికగా రజతోత్సవాలను నిర్వహించాలని నిర్ణయించారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతీసాగర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రమేశ్ హజారి, కోశాధికారి యోగానంద్, తెలంగాణ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు యూనియన్ (టెమ్జు) రాష్ట్ర అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమణకుమార్, సీనియర్ జర్నలిస్టు బుచ్చన్న, రాష్ట్ర నాయకులు సీహెచ్ సుధాకర్, బీఆర్ లెనిన్, తడక రాజ్‌నారాయణ, పెరుమాండ్ల వెంకటేశ్వర్లు, తుమ్మ శ్రీధర్‌రెడ్డి, కక్కెర్ల అనిల్‌కుమార్, హనుమకొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మస్కపురి సుధాకర్, అర్షం రాజుకుమార్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష, కార్యదర్శులు ప్రశాంత్, వేణుగోపాల్, నేషనల్ కౌన్సిల్ సభ్యులు మంచిక అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.



### హరిత దారులు..

'తెలంగాణకు హరితహారం'లో గత కేసీఆర్ సర్కారు హయాంలో నాటిన మొక్కలు ఏపుగా పెరిగి ప్రయాణికులకు చల్లదనంతో పాటు ఆహ్లాదం పంచుతున్నాయి. ప్రస్తుత వేసవిలో 40 డిగ్రీలకు మించి ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో మధ్యాహ్నం వేళ ఎండవేడిమికి అల్లాడుతున్న వాహనదారులు ఈ చెట్ల వద్ద కొద్దిసేపు విశ్రాంతి తీసుకొని వెళ్తున్నారు. చిన్నగూడూరు మండల కేంద్రం నుంచి మానుకోట జిల్లాకేంద్రానికి వెళ్లే రహదారి సీమ తంగేడు, గుల్మోర్, కానుగ, టెకోమొ తదితర మొక్కలతో పచ్చని తోరణంలా కనిపిస్తోంది.

– చిన్నగూడూరు, ఏప్రిల్ 20

## నో క్యాప్చర్

రాష్ట్రంలో రెండో అతిపెద్ద నగరంగా పేరుగాంచిన వరంగల్‌లో నిఘా నేత్రాలు నిద్రపోతున్నాయి. జంక్షన్లు, ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద సీసీ కెమెరాలు అలంకారప్రాయంగా మిగిలాయి. నగరంలో ట్రాఫిక్‌తో పాటు రోడ్డు ప్రమాదాల సంఖ్య కూడా పెరిగిపోతున్నది. రైల్వే కనెక్టివిటీ, జాతీయ రహదారులు అనుసంధానంగా ఉండడంతో అంతర్‌రాష్ట్ర దొంగల ముఠాలు చోరీలకు అడ్డాగా ఎంచుకుంటున్నాయి. రోడ్డు ప్రమాదాలు, దాడులు, హత్యలు, చోరీ ఘటనల్లో సీసీ ఫుటేజీలే కీలకంగా మారుతున్నాయి. ఈ క్రమంలో పూర్తిస్థాయిలో సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో పోలీసులు కేసులను త్వరగా ఛేదించలేకపోతున్నారు. – సుబేదారి, ఏప్రిల్ 20



- నిద్రపోతున్న నిఘా నేత్రాలు
- నగర జంక్షన్లు, ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద పూర్తి స్థాయిలో పనిచేయని సీసీ కెమెరాలు
- చోరీలు, రోడ్డు ప్రమాద ఘటనల్లో సీసీ ఫుటేజీలే కీలకం
- కేసులు ఛేదించలేకపోతున్న పోలీసులు

నగరంలో ట్రాఫిక్ సమస్యలను చక్కదిద్దడానికి 50 జంక్షన్లు, 40 ట్రాఫిక్ సిగ్నల్స్ పాయింట్స్ ఏర్పాటు చేశారు. వీటిలో ప్రధాన జంక్షన్లతో పాటు మరికొన్ని ట్రాఫిక్ సిగ్నల్స్ పాయింట్ల వద్ద స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు కేబుల్ వైర్ ద్వారా పీసీ, కమిషనరేట్ లోని కమాండ్ కంట్రోల్ రూంకు అనుసంధానం చేశారు. అలాగే మున్సిపల్ కార్పొరేషన్ నుంచి స్మార్ట్ పథకం కింద రూ. 80 కోట్లతో ఏడాది క్రితం నగర జంక్షన్ల వద్ద ఏర్పాటు చేసిన 615 సీసీ కెమెరాలను ఎయిర్ ఫైబర్ ద్వారా మున్సిపల్ ప్రధాన కార్యాలయం ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానించారు. ఐట్రిబుల్ సెంటర్ నుంచి 30 టెక్నీషియన్స్ జంక్షన్ల సీసీ కెమెరాలు ఫుటేజీలను ఎప్పటికప్పుడు రికార్డు చేస్తుంటారు. మొదట్లో బాగా పనిచేసినప్పటికీ జంక్షన్ల వద్ద రోడ్డు ప్రమాదాల్లో సీసీ కెమెరాల పోల్స్ దెబ్బతినడం, వైరింగ్ డిస్‌కనెక్ట్, తదితర లోపాలతో క్యాప్చర్ కనిపించడం లేదని టెక్నీషియన్స్ చెబుతున్నారు. సర్వర్ డౌన్ సమస్య వచ్చినపుడు సీసీ ఫుటేజీలు రికార్డు కావడం లేదు. వెంటనే మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఇక స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి కేబుల్ వైర్ ద్వారా జంక్షన్లు, ట్రాఫిక్ సిగ్నల్స్ పాయింట్ల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు కూడా సరిగా పనిచేయ డం లేదు. కేబుల్ వైర్ తెగినపుడు, పోల్స్ దెబ్బతిన్నపుడు పోలీసులు స్పందించడం లేదు. అదేవిధంగా స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో వ్యాపారులు, దాతల నుంచి డబ్బులు వసూలు చేసి హైరేంజ్ కాకుండా, నాసిరకం కెమెరాలు అమర్చడంతో కనీసం 10 మీటర్ల దూరం కూడా క్యాప్చర్ కనబడడం లేదని, తొందరగా దెబ్బతింటున్నాయని టెక్నీషియన్స్ చెబుతున్నారు.

### దర్యాప్తులో సీసీ ఫుటేజీలే కీలకం

ఆధునిక పోలీసింగ్ వ్యవస్థలో ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమంటారు. రోడ్డు ప్రమాదాలు, దాడులు, హత్యలు, చోరీ కేసుల దర్యాప్తులో ఇవి కీలకంగా మారాయి. ప్రధాన జంక్షన్లు, ట్రాఫిక్ పాయింట్ల వద్ద మున్సిపల్ కెమెరాలు మాత్రమే కొంత వరకు పనిచే స్తున్నాయి. ఇక పోలీసులు అర్చిన కెమెరాలు నాసిరకం, మెయింటనెన్స్ లేకపోవడంలో పనిచేయడం లేదనే విమర్శలు ఉన్నాయి. దీంతో పోలీసులు త్వరగా కేసులను ఛేదించలేక పోతున్నారు. రాత్రి సమయంలో రోడ్డు ప్రమాదాలు జరిగినపుడు సీసీ ఫుటేజీ క్యాప్చర్ కనబడకపోవడంతో ఢీకొట్టిన వాహనాలను గుర్తించలేక పోతున్నారు. లా అండ్ ఆర్డర్‌లో పనిచేసే కొందరు పోలీసు అధికారులు తమ పరిధిలో సీసీ కెమెరాల మెయింటనెన్స్, ఏర్పాటుపై సరిగా దృష్టి పెట్టక కేసులను క్రైం విభాగం పోలీసులకు అప్పగించి తప్పించుకుంటున్నారు. ఇటీవల చెడ్డీ గ్యాంగ్ విద్యారణ్యపురి కాలనీలో చోరీ చేశారు. ఇంటి ఓనర్ ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలతో ఈ ముఠా వెలుగులోకి వచ్చింది. నగర జంక్షన్లలోని సీసీ కెమెరా ఫుటేజీలను జల్లెడ పట్టినా ఈ ముఠా ట్రేసవుట్ కాలేదని తెలిసింది. ఈ నేపథ్యంలో మున్సిపల్, పోలీసు ఉన్నతాధికారులు స్పందించి హైరేంజ్ కెమెరాలు ఏర్పాటు చేయాలని నగరవాసులు కోరుతున్నారు. ఔటర్ రింగ్‌రోడ్డు, ఖమ్మం, కరీంనగర్, హైదరాబాద్, నర్సంపేట, ములుగు రహదారుల్లో సిటీ లిమిట్‌లో కూడా ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.